

కథా కౌముది

# కడలి కెరటాలు స్ఫూర్తి మైలవరపు

"సముద్రం, ఎన్ని సార్లు చూసినా ఎప్పుడూ కొత్తగానే వుంటుంది.కడలి కెరటాలు ఏవో కొత్త సంగతులు మోసుకొస్తున్నట్టే అనిపిస్తుంది."

నీలిమ ఇసకలో కూచుని అలల ఆటుపోట్లనే చూస్తోంది. ఇవే మాటలు తను ధరణి తో అనేది చదువుకునే రోజుల్లో సముద్రపొడ్డున కూచుని కబుర్లు చెప్పుకునేటప్పుడు.

ధరణి మాత్రం, అప్పుడు మన మనసు వున్న పరిస్థితిని బట్టీ సముద్రం మనకి కనపడుతుంది అనేది.

ధరణి ని ఈ సాయంత్రం బీచ్ కి రమ్మంది. చాలా రోజుల తర్వాత చాలా సేపు మాట్లాడాలని.

ధరణి రావటానికి ఇంకా రెండు గంటల పైనే పడుతుందని తెలుసు. కావాలనే, వొంటరిగా కెరటాలతో కబుర్లు చెప్పాలని ముందే వచ్చి కూచుంది.

మే నెల వచ్చినా ఇంకా చిరు చలి వున్నట్టే వుంది. నీలాకాశం ఏ మబ్బు తెరలూ లేకుండా స్వచ్ఛంగా వుంది. తల పైకెత్తి చూసింది నీలిమ. నువ్వెప్పుడూ ఆకాశంలా తలెత్తుకుని అందరికన్నా పైనుండాలని నీకు నీలిమ అని పేరు పెట్టానమ్మా అనే వారు నీలిమ తండ్రి ఎప్పుడూ.

గతం తల్చుకునేంత తీరిక దొరక్కూడదనుకునేది ఎప్పుడూ. ఇవాళ మాత్రం కెరటాలు వెనక్కి పరిగెడుతున్నాయి తన ప్రమేయం లేకుండా.

★★★★★★★★★★★

నీలిమ తండ్రి వెంకట్రావు, సివిల్ ఇంజనీర్. నీలిమ చిన్నప్పుడు బ్రిడ్జి కట్టడం పని మీద వొక పల్లెటూళ్ళో వుండే వారు.

నీలిమ తల్లి వేదవతి, నలుగురాడపిల్లలు వున్న ఇంట్లో పుట్టింది. ఇంకా చదువుకోవాలనీ, తన కాళ్ళమీద తను బతకాలనీ కన్న కలలన్నీ పుట్టింట్లోనే వదిలేసి కోరి వచ్చిన సంబంధం కాబట్టి పెళ్ళి చేసుకుంది.

వేదవతి చదువు మీద తనకున్న ప్రేమ మొత్తం కూతురికి అబ్బేలా చాలా జాగ్రత్తగా చూసుకుంది.

వెంకట్రావు గారు ఆ వూళ్ళో పోస్ట్ మాస్టారితో ఎక్కువ స్నేహం చేసేవారు. తన వెనకాలే తిప్పుకునేవారు. తనతో స్థాయికి తూగుతారని తెలిసినా ఆ వూరి డాక్టర్తోనో, భూ కామందులతోనో ఎక్కువ స్నేహం చేసేవారు కాదు. వాళ్ళయితే తన వెనకాల తిరగరని.

నీలిమ తల్లి చెప్తే, చదువుని ప్రేమించడం నేర్చుకుంది. తండ్రిని చూసి, చాలా విషయాలు నేర్చుకుంది.

ధరణి తండ్రి రవణ అదే వూళ్ళో పంచాయితీ ఆఫీసు లో గుమాస్తా. ముగ్గురాడపిల్లలు, వొక మగ పిల్లాడు. ధరణి మూడో కూతురు.

నీలిమ, ధరణీ వొకే క్లాసు. వొకే బెంచీలో కూచునేవారు ఎప్పుడూ.

నీలిమ తర్వాతి మార్కులు ధరణికే వచ్చేవి. నీలిమ తర్వాత ధరణే క్లాసులో అందంగా వుండేది. నీలిమ ధరణితోనే స్నేహం చేసేది. వాళ్ళ క్లాసులో అందరి దృష్టిలోనూ వాళ్ళిద్దరూ ప్రాణ స్నేహితులు.

ధరణి నీలిమలా చదువే ప్రాణంలా వుండేది కాదు. పాటలు పాడేది. స్కూల్లో జరిగే కల్చరల్ ప్రోగ్రామ్స్ లో ముందుండేది.

నీలిమకి ఇవన్నీ టైమ్ వేస్ట్ పనుల్లా అనిపించేవి. ఐనా ధరణికి ఏవీ చెప్పేది కాదు. నీలిమ ధరణి తో ఏ విషయంలో పోట్లాడేది కాదు. తనతో పోట్లాడే అంత స్వతంత్రం కూడా ఇచ్చేది కాదు.

★★★★★★★★★★★

చెయ్యి గట్టిగా నొప్పెట్టేసరికి చటుక్కున తీసి చూసుకుంది నీలిమ.

తొక్కిన అమ్మాయి వొకటికి పది సార్లు సారీలు చెప్పి నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

ఆ అమ్మాయితో పాటూ ఇంకో అమ్మాయి కూడా వుంది. వెళ్ళేవాళ్ళ మాటలు నీలిమ చెవిలో పడుతున్నాయి. ఆ పక్క అమ్మాయి మెడలో వున్న నెక్లెస్ తనకి ఎంత నచ్చిందో, అది పెట్టుకోవడం వల్ల ఎంత అందంగా వుందో చెప్తోంది ఈ అమ్మాయి. దానికి ఆ అమ్మాయి మొహమంతా నవ్వు చేసుకుని చూస్తోంది.

తను ఎప్పుడయినా ఎవరినయినా మనస్ఫూర్తిగా అభినందించానా అని నీలిమ మనసు ముల్లులా గుచ్చుతోంది.

★★★★★★★★★

గేటు చప్పుడుకి వీధి వసారాలో పట్టె మంచం మీద కూచుని చదువుకుంటున్న నీలిమ తలెత్తి చూసింది.

చేతిలో కవర్ తో ధరణి. మొహంలో దాద్దామన్నా దాగనంటున్న సంతోషం.

"ఏంటీ ఇప్పుడొచ్చావ్? నోట్సేమన్నా కావాలా?"

"ఏమీ లేదు. నాన్న నా పుట్టినరోజుకని ఈ పట్టు పరికిణీ జాకెట్టూ తెచ్చారు. ఈసారి కొత్త బట్టలు కొంటాడనుకోలేదు. నీకు చూపిద్దామని తెచ్చాను."

కవర్ తీసి చూసింది నీలిమ. నెమలికంఠం రంగు పరికిణీకి రాణీ కలర్ అంచు. అసలైన పట్టు కాకపోయినా అందంగానే వుంది. తెల్లటి ధరణి వేసుకుంటే ఇంకా బావుంటుంది.

"చాలా బావుంది. రేపేగా నీ పుట్టినరోజు. ఇది వేసుకుని వస్తే స్కూల్ మొత్తం నీ చుట్టూనే."

ఆ మాటకి ధరణి మొహమంతా నవ్వు పులుముకుంది.

మర్నాడు పొద్దున్న బీరువాలో దాచివున్న కొత్త  చిలకాకుపచ్చరంగు పట్టు పరికిణి, ఎర్రటి అంచు, నిండా ఝరీ. దానిమీద ఎర్రటి పట్టు కాకెట్టూ వేసుకుని స్కూలుకి తయ్యారయ్యింది.

“అది పండక్కని కుట్టించానే” అంది వేదవతి నీలిమని చూసి.

"నాకిప్పుడే వేసుకోవాలనిపించింది."

వేదవతి ఏదయినా కూతురికి వొకసారే చెప్పేది. అయినా వినకపోతే వాదనకి దిగేది కాదు. ఎక్కువగా దేనిగురించయినా అలోచిస్తే చదువుమీదనుండీ కూతురి దృష్టి మళ్ళిపోతుందని భయం.

నీలిమ అనుకున్నట్టే స్కూలు మొత్తం తన చుట్టూనే వుంది. ఎక్కడ కొన్నారో, ఎవరు కుట్టారో కనుక్కుంటూ, ఆ పరికిణీలో నీలిమ ఎంతలా మెరిసిపోతోందో చెబుతూ.

నీలిమని చూస్తూనే ధరణి “అబ్బ, ఎంత బావున్నావే. అచ్చం బొమ్మలా వున్నావు” అంటూ నవ్వింది.

ఆ నవ్వు నిన్న సాయంత్రంలానే వుంది. ఎంత వెతికినా నీలిమ ఆశించిన తేడా ఏమీ కనపడలేదు.

★★★★★★★★★★

వొక పెద్ద అల నీలిమ కాళ్లని తాకింది.

దాని నీటి తుంపర ముఖం దాకా వచ్చి పలకరించింది.

నీలిమ సెల్ ఫోన్ లో టైమ్ చూసింది. 'ఇంకో గంటైనా పడుతుందేమో ఈ ట్రాఫిక్కు లో ధరణికి' తనలో తనే అనుకుంది.

అలలు వొకదానితో వొకటి పోటీ పడుతున్నాయేమో ఆకాశాన్ని అందుకోవాలని అనిపించేది తనకి సముద్రాన్ని చూస్తే. మీరు నన్ను ఎప్పటికీ తాకలేరు అని ఆకాశం ఠీవి గా నిలబడి నవ్వుతున్నట్టనిపించేది. అలా అనుకున్నప్పుడల్లా నీలిమ చిన్నగా నవ్వుకునేది. ఆ నవ్వులో తను నీలిమని అన్న గర్వం తొణికిసలాడేది.

★★★★★★★★★

"అమ్మాయ్, ధరణి కి ఫోన్ అని చెప్పమ్మా". మూడో అంతస్తు లోంచి హాస్టల్ ఆంటి గొంతు ఖంగు మని వినపడుతోంది రూమ్ లో అప్పుడే ఆఫీస్ నుంచొచ్చి టీ తెచ్చుకుని కూచున్న ధరణికి.

అమ్మ ఎప్పుడూ ఆదివారాలే కదా చేస్తుంది? ఇప్పుడెందుకు చేసిందా అనుకుంటూ కింద ఫ్లోర్లో వున్న ఎక్స్టెంషన్ దగ్గరకి పరిగెట్టింది చేతిలో వున్న టీ గ్లాస్ పక్కన పెట్టి.

నేను గుర్తున్నానా అంది అవతలి కంఠం.

“ఎవరూ?.... నీలిమ?” రెండు నిమిషాల మౌనం తరవాత ధరణి జవాబు. ఆ గొంతులో ఆశ్చర్యం, ఆనందం రెండూ తొంగి చూశాయి.

టెంత్ తర్వాత నీలిమ రెసిడెన్షియల్ కాలేజీ లో చేరింది. ధరణి పక్క వూర్లో వున్న గవర్నమెంట్ జూనియర్ కాలేజీతో సరిపెట్టుకుంది. సెలవలకి వచ్చినప్పుడు కబురు పెడితే వెళ్ళి కలిసి వచ్చేది. ఇంటర్ తర్వాత నీలిమ ఐఐటీ లో సీట్ వచ్చి వెళిపోయింది. వాళ్ళ నాన్నగారు కూడా ప్రైవేట్ కాంట్రాక్ట్స్ చెయ్యడం మొదలెట్టి పక్క సిటీ కి మకాం మార్చేసారు. ధరణి పక్క వూళ్ళో వున్న డిగ్రీ కాలేజీ లో బి.ఎస్.సి లో చేరింది. కంప్యూటర్ కోర్సులు విడిగా వొక ఇనిస్టిట్యూట్ లో నేర్చుకునేది. అప్పటినుంచీ వూరి నుంచి ఎవరైనా సిటీకి వెళ్ళినప్పుడు నీలిమా వాళ్ళ కబుర్లు మోసుకురావడమో. వూళ్ళో కొన్న పొలాలు చూసుకోడానికి వాళ్ళ నాన్నగారు వస్తే నీలిమ ఎంత గొప్పగా చదువుతోందో తెలుసుకోవడమో తప్ప ఇద్దరూ వొకళ్ళతో వొకళ్ళూ మాట్లాడుకుంది లేదు.

"ఏంటే ఇన్నాళ్ళ తర్వాత హఠాత్తుగా గుర్తొచ్చానూ? ఐనా ఈ నంబర్ నీకెలా తెలిసింది?"

"తెలుసుకోవాలనుకుంటే ఏవయినా తెలుస్తాయ్."

"ఇంతకీ ఏం చేస్తున్నావ్? ఎక్కడున్నావ్?"

"ప్రోజెక్ట్ వర్క్ అయ్యింది. రెండు మూడు మల్టీ నేషనల్ కంపెనీల నుండి ఆఫర్స్ వున్నాయి. ఏది తీసుకోనా అని ఆలోచిస్తున్నా. నువ్వేదో చిన్న కంపెనీలో అడ్మిన్ గా చేస్తున్నావటగా."

"బానే సంపాదించావ్ వివరాలు. అన్నయ్యలు ఎవరి దారి వాళ్ళు చూసుకున్నారు. నాన్న పెన్షన్ కి కొంచెం తోడుగా వుంటుందనీ."

"సర్లే గానీ పెళ్ళి గురించి ఏవాలోచించావోయ్?"

"ఏమోనే. ఇంకా దానిగురించయితే ఏవీ అలోచించలేదే."

"చదువూ, కెరీరే కాదు, పెళ్ళి కూడా చాలా ముఖ్యమయినది జీవితంలో. బాగా ప్లాన్ చేసుకోవాలి." కొత్తగా వినపడింది నీలిమ.

"సర్లే. అసలు ఎలాంటి అబ్బాయి కావాలనుకుంటున్నావ్? నాతో చెప్పు."

ధరణికి కాస్త వుత్సాహమొచ్చింది, పాత స్నేహితురాలు ఎప్పుడూ లేనంత చనువుగా మాట్లాడుతుంటే.

"నిజం చెప్పమంటావా.పెళ్ళి గురించి ఆలోచించినప్పుడల్లా ముక్కూ మొహం తెలియని వాడితో జీవితం పంచుకోవాలంటే ఏవిటో భయంగానూ, గుబులుగానూ వుంటుంది. ఎవరైనా తెలుసున్న వాళ్ళయితే బావుణ్ణు అనిపిస్తుంది."

"నీ గురించి నాకు తెలుసు. అందుకే నాకొక ఆలోచన వచ్చింది నిన్న ఎందుకో. మన పవన్ నువ్వూ పెళ్ళి చేసుకుంటే బావుంటుంది కదా అనిపించింది."

పవన్ ధరణీ వాళ్ళ వూర్లోనే వో మోస్తరు ఆస్థిపరుడైన భూస్వామి కొడుకు. నీలిమకీ, ధరణికీ మంచి ఫ్రెండ్. వాళ్ళతో పాటే పదో తరగతి దాకా చదివాడు. తర్వాత ఇంటర్ నీలిమ తో పాటే రెసిడెన్షియల్ కాలేజీ లో చదివి, ఎమ్ సెట్ లో మంచి రాంక్ రావడంతో, ఇంజనీరింగ్ లో చేరాడు. చూడ్డానికి చక్కగా వుంటాడు.

ధరణికి పవన్ మీద మంచి అభిప్రాయమే వుంది. మనసు పొరల్లో ఎక్కడో కాస్త ఇష్టమూ వుంది.

"తను నన్ను ఎందుకు చేసుకుంటాడే. వాళ్ళకి మేము సరిపోంలే గానీ ఇంకేంటీ కబుర్లూ."

"నీ మొహం. నీకంతా మొహమాటమే ఎప్పుడూ. పవన్ నీకన్నా నాకు ఎక్కువ ఫ్రెండ్. వొక వూరి వాళ్ళూ. చిన్నప్పట్నుంచీ నువ్వు ఎంత మంచి పిల్లవో తెలుసు. నీకెందుకూ నేను పవన్ తో మాట్లాడతా వుండు. నాకు టచ్ లోనే వున్నాడు. నీకొక మాట చెప్పి తనకి కాల్ చేద్దామని ఆగాను. వొక ఐదు నిమషాల్లో శుభవార్త తో చేస్తా ఫోన్ దగ్గరే వుండు."

ధరణి అనుమతి ఆశించకుండానే ఫోన్ పెట్టేసింది నీలిమ.

నీలిమ ఎప్పుడూ ఇలా మాట్లాడలేదు. తన గురించి ఇంత శ్రద్ధ చూపించలేదు. ఏవిటో విచిత్రంగా అనిపించింది ధరణికి. ఇప్పుడు నిజంగానే పవన్ తో మాట్లాడుతుందా? మాట్లాడితే ఏవంటాడో. చిన్న ఆశ చిగురించింది మనసులో. తనకి తెలియకుండానే ఏదో వుత్కంఠ ఆ అయిదు నిమిషాల్లో.

చెప్పినదానికంటే ముందే మోగింది ఫోన్. పైన, ఆంటీ ఎత్తకుండానే ధరణి ఎత్తేసింది.

"చెప్పు నీలిమా. ధరణి ఆతృత ఎంత దాచుకుందామన్నా నీలిమకి వినపడుతూనే వుంది."

"నేనిలా అవుతుందని అనుకోలేదు...."

"ఏవన్నాడే? త్వరగా చెప్పు."

"ఏవీ అనలేదు."

"మరి?"

"నువ్వు ధరణి ని పెళ్ళి చేసుకుంటే బావుంటుంది కదా అన్నాను. ఊ, ఆ ఏవీ అనకుండా ఫోన్ ఠపీమని పెట్టేసాడు."

ధరణి మనసు చివుక్కు మంది. కాస్సేపు నిశ్శబ్దం తర్వాత ధరణే ముందుగా గొంతు పెగుల్చుకుంది.

"పోన్లేవే. ఏదో చేద్దావనుకున్నవ్. సర్లే ఇంక ఈ విషయం వదిలెయ్. ఎంత దాచాలన్నా ధరణి గొంతులో నిరాశ కూడా నీలిమకి వినపడుతూనే వుంది."

★★★★★★★★★

"నీలిమా అన్నట్టు నీకిది తెలిసిందా?"

"ఏవిటమ్మా?"

"ధరణి, తను పనిచేసే చోట ఎవర్నో ప్రేమించి ఇంట్లో ఎదిరించి మరీ పెళ్ళి చేసుకుందట."

"వోహో!"

వేదవతి అనుకున్నంతగా కూతురినుంచి  స్పందన ఏవీ రాలేదు.

నీలిమ రాజీవ్ వాళ్ళ కుటుంబంతో మాట్లాడ్డానికి వెళ్ళినప్పుడు ఎలా నడుచుకోవాలో చెప్పడానికి ఫోన్ చేసింది.

రాజీవ్, నీలిమ క్లాస్మేట్ ఐ ఐ టీ లో. నీలిమా వాళ్ళకన్నానాలుగు రెట్లు డబ్బూ పలుకుబడీ వున్న కుటుంబం. వాళ్ళనాన్నగారికి విదేశాల్లో కూడా వ్యాపారాలు వున్నాయి.

నీలిమ అందం, తెలివీ, చురుకుదనం సహజంగానే రాజీవ్ ని ఆకర్షించాయి.

రాజీవ్ పెళ్ళి విషయం ఎత్తినప్పుడు నీలిమకి కాదనడానికి కారణాలేవీ కనపడలేదు. రెండువైపుల కుటుంబాలకీ కూడా అడ్డు చెప్పాల్సిన అవసరం కనపడలేదు.

ఫోన్ పెట్టేసే ముందు నీలిమ అడిగింది "అబ్బాయ్ బావుంటాడా?"

వేదవతికి వొక నిమిషం ఎవరి గురించి అడుగుతోందో అర్థం కాలేదు.

మళ్ళీ నీలిమే అంది. 'ధరణి చేసుకున్న అబ్బాయి'.

"అతనా... లేదే. దీనికన్నా చాలా పెద్దట. ఇది పచ్చగా వుంటుందా, అతను రంగు తక్కువా, బట్టతలా అన్నారు. కాకి ముక్కుకి దొండ పండులా వుంది జంట అంది కమలత్త."

"ఏం చేస్తూ వుంటాడు?"

"సాఫ్ట్ వేరేట. అమెరికా తీసుకెళ్ళిపోతాడని చెప్పింది. ఎలా నచ్చాడో ఏవిటో అనుకుంటున్నారు మన వూరివాళ్ళంతా..."

'సరేనమ్మా ఇంక వుంటాను'. వుత్సాహంగా చెప్పుకు పోతున్న వేదవతి మాటలకి అడ్డుకట్ట వేస్తూ ఫోన్ పెట్టేసింది నీలిమ.

కూతురి తత్వం బాగా తెలిసున్నా మొదటిసారి ఆ ధోరణి బాధపెట్టింది వేదవతిని.

★★★★★★★★★★

చిన్న పిల్లాడి ఏడుపు గట్టిగా తట్టిలేపింది. తను కూచున్న చోటికి మాటలు వినపడేంత దూరంలో కూచుందో కుటుంబం. నాలుగేళ్ళుంటాయేమో. తను కట్టుకున్నఇసుక గూడు అలల తాకిడికి కొట్టుకుపోయిందని సముద్రం నీళ్ళకన్నా వుప్పటి కన్నీళ్ళు ధారలుగా కారుస్తున్నాడా పిల్లాడు.

వాడి నాన్న, వాణ్ణి వొళ్ళో కూచోబెట్టుకుని, కళ్ళు తుడిచి మంచినీళ్ళు పట్టాడు. కాస్త స్వరం తీవ్రత తగ్గాక, ఈసారి ఇంకా అందంగా గూడు కడతావనే నీ గూడు పట్టికెళ్ళిందమ్మా సముద్రం అనునయంగా వినబడింది తండ్రి కంఠం.

మళ్ళీ కొట్టుకుపోతేనో? వస్తున్న ఏడుపుని గట్టిగా అదిమి పట్టిన కంఠం. తల అటు తిప్పకుండానే పిల్లాడి బుంగమూతి కనపడుతోంది నీలిమకి.

అప్పుడు ఇంకా బాగా కడుదువుగానీ. తేలికగా చెప్పినా మనసులో ముద్ర పడేలా చెబుతున్నాడు తండ్రి, వోడిపోతే ఆగిపోకూడదని.

నీలిమ మనసులో మెలిపెట్టినట్టనిపించింది, తనకి నెగ్గడమే నేర్పారే ఎప్పుడూ అనిపించి.

★★★★★★★★

పెళ్ళికి ముందు ఆరాధించినంతగా, గౌరవించినంతగా పెళ్ళి తర్వాత కూడా చెయ్యగలిగే అబ్బాయిలు చాలా తక్కువగా వుంటారు. రాజీవ్ ఆ తక్కువమందిలో లేదు.

పెళ్ళి తర్వాత తొంభై శాతం విషయాల్లో రాజీ పడాలని చాలా మంది అమ్మాయిలకి ఎవరూ చెప్పకుండానే తెలిసిపోతుంది. నీలిమ ఆ చాలామందిలో లేదు.

నా పెళ్ళావే కదా, తనని విమర్శించడం, ఏడిపించడం తన హక్కనుకున్నాడు రాజీవ్.

తననుకున్నది చెయ్యడం, చేయించడం తప్ప ఇంకొకళ్ళ మాట వినడం అన్నది అనుభవం లేని నీలిమకి అవన్నీ చాలా అసహజంగా, అవమానం గా అనిపించాయి.

ఒకింటివాళ్ళయిన తర్వాత ఎలాంటి గొడవలైనా ఇద్దరి మధ్యనే వుండాలన్న పెద్దరికం రాని ఆ ఇద్దరి గొడవలూ పెద్దవాళ్ళదాకా చేరిపోయాయి.

గాలివానలుగా ఆగాల్సినవి కూడా పెద్ద పెద్ద తూఫాన్లైపోయాయి. గువ్వల జంట చెరో గూటికీ ఎగిరిపోయింది.

తన లెక్కలు ఎప్పుడూ తప్పవనే నమ్మకంతో వుండే నీలిమకి, తను వేసిన అతిపెద్ద లెక్కలో తగిలిన ఎదురు దెబ్బని ఎలా తట్టుకోవాలో తెలియలేదు. దేనిమీదా దృష్టి నిలపలేక ఉద్యోగం కూడా మానేసింది. ఎవ్వరితోనూ మాట్లాడ్డం మానేసింది. ఎవరైనా పలకరించినా కసురుకునేది.

తన చుట్టూ వున్నవాళ్ళంతా తన ఈ పరిస్థితి కి కారణం అనిపించేది.

తల్లీ, తండ్రీ కూడా పలకరించడానికి భయపడేలా మాట్లాడేది.

జీవితం అక్కడితో ఆగిపోయిందనిపించేది. తన ఆలోచనలన్నీ స్థంభించిపోయాయనిపించేది. ఆ శూన్యం లో ఎన్ని యుగాలో గడిచిపోతున్నట్టనిపించేది.

నిశ్శబ్దం లో కొట్టుకుపోతున్న రోజుల్లో వొకరోజు ఫోన్ రింగ్ అయ్యింది. కాల్ ఎటెండ్ చెయ్యడానికి ఎవ్వరూ లేక తప్పదన్నట్టు నీలిమ లేచొచ్చి ఫోన్ రిసీవ్ చేసుకుంది.

అవతల గొంతు "నీలూ" అంది.

ఆ గొంతులో ఏదో తెలియని ఆత్మీయ స్పర్శ.

ప్రపంచం మొత్తం తనని వెలి వేశారన్న నిరాశలో కూరుకుపోయిన మనసుకి ఆ పిలుపు చాలా దగ్గర గా అనిపించింది.

“ధరణీ...” నీలిమ గొంతు నూతిలోనుంచి వచ్చినట్టుగా వుంది.

ఎన్నాళ్ళుగానో గడ్డ కట్టుకుపోయిన గుండె వొక్కసారిగా కరిగిపోయి కళ్ళల్లోంచి పొంగుకొచ్చింది.

ఎప్పుడూ గంభీరంగా వుండే నీలిమ బేలగా తన చిన్ననాటి చెలికి మనసు పొరల్లో గూడుకట్టుకుని తనని వేధిస్తున్న సంగతులన్నీ చెప్పేసుకుంది.

ధరణి కూడా అన్నీ వింది. తను చేసిన దాన్లో తప్పేవీ లేదని వోదార్చింది.

తనున్న మానసిక పరిస్థితికి, తప్పొప్పులు చిట్టా వేసే వాళ్ళకన్నా, తను చేసిన దాన్లో తప్పేవీ లేదని చెప్పేవాళ్ళ అవసరమే వుండడంతో, ధరణి ఎప్పుడూ లేనంత దగ్గరగా అనిపించింది.

అది మొదలు ధరణి తరచూ మాట్లాడేది. నీలిమ కూడా ధరణి ఫోన్ కోసం ఎదురు చూసేది.

కూతురు మనుషుల్లో పడటం, నీలిమ తల్లిదండ్రులకి కూడా రిలీఫ్ గా అనిపించింది.

నీలిమ లో నిరాశ కాస్త తగ్గిందనిపించాక, ధరణి వొకరోజు అంది

"నువ్వూ ఇక్కడికొచ్చెయ్ నీలూ..."

"నేనక్కడికొచ్చి ఏం చేస్తానే?"

"నీ క్వాలిఫికేషన్ కి మంచి వుద్యోగం వస్తుంది. నాకు తెలుసున్న వాళ్ళని అడిగాను."

"నేనొక్కర్తినీ ఏవీ చెయ్యలేననిపిస్తోంది ధరణీ"

"ఎందుకు చెయ్యలేవు? నేనే చేస్తుండగా లేనిది."

"నువ్వొకర్తివీ ఏవిటీ?"

"నీలూ... నీకిన్నాళ్ళూ ఎందుకులే అని చెప్పలేదు. నేను సింగిల్ మామ్ ని. నాకున్న చదువుకి ఇక్కడ ఏమి చెయ్యాలో తెలియక మొదట్లో చాలా ఇబ్బంది పడ్డాను. కొన్నాళ్ళు చిన్న చిన్న స్టోర్స్ లో చేసి... ఈ మధ్యే చిన్న రెస్టారెంట్ పెట్టాను ఇంకొకమ్మాయి తో కలిసి..."

నీలిమ కి మొదటి సారి తనకే కాదు అందరికీ ఇబ్బందులుంటాయి అనిపించింది.

ధరణి ఆ తర్వాత తన రెస్టారెంట్ వల్ల తనకి తెలుసున్న వాళ్ళందరితోమాట్లాడి, నీలిమకి వుద్యోగం చూసింది. నీలిమ కి ఎప్పటికప్పుడు కావల్సిన సపోర్ట్ ఇస్తూ తను అమెరికాకి రావడానికి అన్నీ చూసి పెట్టింది.

నీలిమ కి వుద్యోగం వచ్చిన కంపెనీ తన ఇంటికి దూరం గా వుండడంతో అక్కడకి దగ్గర్లో షేరింగ్ అపార్ట్మెంట్ కూడా చూసి వుంచింది.

నీలిమ వచ్చిన రెండో రోజే అక్కడకి షిఫ్ట్ చేసింది.

కొన్ని రోజులు యుగాల్లా గడిస్తే, గత కొన్ని రోజులు నిమిషాల్లా పరిగెత్తాయి.

ఇక్కడకొచ్చి మూడు వారాలు గడిచిపోతున్నా ధరణిది ఎప్పుడూ బిజీ షెడ్యూలే కావడంతో సరిగ్గా మాట్లాడ్డమే కుదరట్లేదు.

★★★★★★★★★★

భుజం మీద చెయ్యి మెత్తగా తగలడంతో నీలిమ వెనక్కి తిరిగింది.

ధరణి... ఎప్పట్లాగే హాయిగా నవ్వుతూ...

వొకప్పుడయితే ఆ ప్రశాంతమయిన మొహం చూసినప్పుడల్లా తెలియని చిరాకొచ్చేది. ఇవాళ అలా అనిపించలేదు.

"చాలా సేపయ్యిందా వచ్చి"?

"కావాలనే ముందొచ్చాలే..."

"నువ్వొచ్చి ఇన్నాళ్ళైనా ఇప్పటికి కుదిరింది. ఎలా వుంది ఉద్యోగం? ఫరవాలేదా?"

"ఊ..."

"నీతో వొకటి చెప్పాలని ఇక్కడ కలుద్దామన్నాను."

చుట్టూ చూస్తున్న ధరణి, నీలిమ వైపు చూపు తిప్పింది.

ఇసకలో వేళ్ళతో గీతలు గీస్తూ నేల వైపే చూస్తోంది నీలిమ.

"ఆ రోజు నేను నీకు ఫోన్..." మాటల కోసం వెతుక్కుంటోంది.

"తెలుసు." మధ్యలోనే కట్ చేసింది ధరణి.

చటుక్కున తల పైకెత్తి ధరణి వైపు ఆశ్చర్యం గా చూసింది నీలిమ.

"ఏం తెలుసూ...?"

"నువ్వారోజు నాకెందుకు ఫోన్ చేసావో తెలుసు."

........................

" కొన్నిరోజుల తర్వాత వూరెళ్ళినప్పుడు అమ్మ చెప్పింది. పవన్ నిన్ను పెళ్ళి చేసుకోవాలని ప్రపోజ్ చేస్తే నువ్వు కాదన్నావని. కొంచెం ఆలోచించాకా అర్ధమయ్యింది. తను నిన్ను చేసుకోవాలని ఆశ పడటం నేను తనని చేసుకోవాలని ఆశపడటం లాంటిదని ప్రాక్టికల్ గా చెప్పాలనుకున్నావని."

"నీకు ఫోన్ చెయ్యకుండానే పవన్ ని అడిగి వుండొచ్చు.... కానీ...."

"నన్ను కూడా ఏడిపించాలనుకున్నావ్. చిన్నప్పట్నుంచీ నీకు నేనంటే ఎందుకో అసూయ. ఒక్క దెబ్బకి రెండు పిట్టలనుకున్నావ్. అవునా? " నవ్వింది ధరణి.

ఆ నవ్వు ఎప్పట్లాగే వుంది. కానీ నీలిమ కి మాత్రం చెంప ఛెళ్ళుమనిపించినట్టనిపించింది.

నీలిమ మొహం పాలిపోయింది. కొన్ని నిమిషాలు ఏమీ మాట్లాడలేకపోయింది. కొంచెం సేపటికి సద్దుకుని అడిగింది.

"నీకు నామీద కోపం రాలేదా?"

"ఎందుకు రాలేదూ. చాలా కోపమే వచ్చింది. వొక రకంగా ఆ కోపం చిరాకూ వీటిల్లోనే నా వెంట పడుతున్నసునీల్ తో పెళ్ళికి వొప్పేసుకున్నాను."

"మరి ఇప్పుడు, ఆ కోపం...? అంతా అర్ధమయ్యి నాకు సాయం చెయ్యాలనుకున్నావా!"

"......."

"నిజం చెప్పాలంటే మొదట నేనుకూడా, నీకు సరైన గుణపాఠమే నేర్పింది నీ జీవితం అనుకున్నాను. కానీ నేనిక్కడ వొంటరిగా పద్ద తిప్పలూ, అలాంటి సమయంలో నాకు అప్పుడే పరిచయమైన వాళ్ళు కూడా చేసిన సాయం, ఇవన్నీ గుర్తొచ్చినప్పుడు, చిన్నప్పట్నుంచీ కలిసి పెరిగిన నేను నీ గురించి అలా అలోచించడం తప్పనిపించింది.

ఎప్పుడైనా ఏదైనా తప్పు జరిగినప్పుడు ఎవరి వల్లా అని మూడు నాలుగు సార్లు ప్రశ్నించుకుంటే వేలు చివరికి మనవైపే చూపిస్తుందని ఎక్కడో చదివాను. అది చాలా సార్లు అప్లై చేసి చూస్తే నిజవే అనిపించింది.

ఆ రోజు నా నిరాశ కి కారణం నా ఆశ. ఆ తర్వాత నా జీవితం లో వచ్చిన ఆటుపోట్లకి కారణం ఆ నిరాశ లో నేను తీసుకున్న నిర్ణయం. ప్రస్తుతం సాఫీగా సాగుతున్న నా జీవితానికి కారణం నా పట్టుదల. అన్నింటికీ బాధ్యత మనదే అన్న ఆలోచన చాలా వరకూ మన కోపాలనీ, చికాకుల్నీ తగ్గిస్తుంది."

"................"

"చివరిగా వొక్కటడగాలి నిన్ను. ఏ విషయమైనా ఇంత లోతుగా ఆలోచించే నువ్వు ఇలా వొంటరిగా ఎలా మిగిలావ్?"

"చిన్నప్పట్నుంచీ నేను పెరిగిన పరిస్థితులు సర్దుకుపోవడం నేర్పాయి గానీ...ఏం చేసినా పడుండటం నేర్పలేదు నీలూ..." అని చిన్నగా నవ్వింది.

నీలిమ కి ఏవనాలో ఏమీ తోచలేదు ఆ జవాబుకి.

కాస్సేపటికి మళ్ళీ ధరణే మాట్లాడ్డం మొదలెట్టింది.

" నీకొకటి చెప్పనా నీలూ, సునీల్ తో నాది అనుబంధం కాదు. వొక పొరపాటు. నేను బంటిగాడిని కూడా ఆ రిలేషన్ షిప్ కి గుర్తులా కాదు, కేవలం నా కొడుకు, నేను పూర్తిగా పడిపోకుండా నన్ను నిలబెట్టిన ఏకైక బంధం గానే చూస్తాను. మనిద్దరికీ మధ్యనున్నది చిన్నప్పటినుండీ కలిసి పెరిగిన అనుబంధం. మధ్యలో జరిగినవి కొన్ని పొరపాట్లు. నీ విషయంలో మన చిన్నప్పటి స్నేహాన్ని మాత్రమే గుర్తుపెట్టుకోవాలనుకున్నాను. ఆ పొరపాట్లని కాదు."

ఎటో చూస్తూ మాట్లాడుతున్న ధరణి నీలిమ వైపు తిరిగింది. నీలిమ, ధరణి చేతిని తన చేతుల్లోకి తీసుకుని మెత్తగా నొక్కి వదిలి ధరణి మొహంలోకి చూస్తూ నవ్వింది. తన నవ్వు ధరణి నవ్వంత నిర్మలంగా వున్నట్టనిపించింది.

ఇద్దరి మొహాలూ మబ్బులు విడిపోయిన ఆకాశం లా తేటగా వున్నాయిప్పుడు. ఇద్దరూ నెమ్మదిగా కబుర్లల్లో పడ్డారు. ఇప్పుడు వాళ్ళు ప్రాణ స్నేహితులని చూసే వాళ్ళకే కాదు వాళ్ళకీ తెలుస్తోంది.

ధరణి మళ్ళీ పాత ధరణిలా, చిన్నప్పటి సంగతులూ, వూళ్ళో విశేషాలూ, బంటిగాడి అల్లరీ అన్నీ గల గలా చెప్పుకుపోతోంది. నీలిమ మధ్య మధ్య మాటకలుపుతూ కాళ్ళమీద తల పెట్టుకుని ధరణినే చూస్తోన్నదల్లా, జాబిలమ్మ రాకతో ఎగసిపడుతున్న కెరటాల వైపు చూపు తిప్పింది.

ఆకాశం తన దాహం తీర్చుకోడానికి కెరటాలని తనవైపు లాక్కోవాలని ఎంతగా వంగుతున్నా.... అవి పుడమిని ముద్దాడాలనే పరుగులెడుతున్నట్టనిపించింది మొదటిసారి.

రచయిత్రి బ్లాగు

naarathalu.blogspot.com

Post your comments